క్లుప్తంగా

అర్జీల ఆన్‌లైన్‌కు అవకాశం కల్పించాలి

త్రిపురారం : ప్రజా పాలనలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం కల్పించాలని ఐఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య కోరారు. ఈ మేరకు సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో 150 మంది దరఖాస్తులు ఆన్‌లైన్ చేయలేదని పేర్కొన్నారు. దీంతో ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందడంలేదని కలెక్టర్‌కు వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ

మిర్యాలగూడ: మండలంలోని ఆలగడప ప్రాథమిక పాఠశాలకు లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కె.జయరాజన్ సోమవారం మైక్‌సెట్ అందించి దాతృత్వాన్ని చాటుకున్నట్లు ఎంఈఓ లావూరి బాలునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మైక్‌సెట్ అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్‌రావు, ఏఏపీసీ చైర్మన్ రజిత, ట్రస్మా జిల్లా సెక్రటరీ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మమత, స్వర్ణ, రమా పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందులు తీర్చాలి



తహసీల్దార్ జవహర్‌లాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు.

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని సీపీఎం మండల కార్యదర్శి వినోద్‌నాయక్ కోరారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దయానంద్, పిచ్చయ్య, హనుమంతు, ఖాజా మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : దేవరకొండ డివిజన్ గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కొండమల్లేపల్లి మండల విద్యాధికారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నాగేశ్వర్‌రావును సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభినందనలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో సోమవారం ఎస్‌ఐ అజ్మీరా రమేష్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్య చర్యలు ఉంటాయని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు.

వాచ్‌మెన్ ఉద్యోగానికి దరఖాస్తుల స్వీకరణ

నిడమనూరు : నిడమనూరు ఆదర్శ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్, స్వీపర్, స్కావెంజర్ విధుల నిర్వహించేందుకు గాను ఆసక్తిగల అభ్యర్థుల నుంచి ఈనెల 19 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి ఎల్ వెంకన్న తెలిపారు. దరఖాస్తు ఫారం ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో తీసుకుని పూర్తి చేసిన వాటిని అక్కడే అందజేయాలని సూచించారు.

రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్‌బాబు

చందంపేట : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి అధికారులకు రైతులు సహకరించాలని చందంపేట తహసీల్దార్ శ్రీధర్‌బాబు కోరారు. సోమవారం చందంపేట మండలం అచ్చంపేట పట్టి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలన్నారు. సభలో ఆర్‌ఐ హబీబ్, రాజు, అనిల్, పృథ్వీ, బద్యానాయక్, లోక్యనాయక్‌పాల్గొన్నారు.

సంత స్థలం.. పరాధీనం?

- కబ్జాకు గురవుతున్న కొండమల్లేపల్లి పశువుల సంతచోటు
- 18 ఏళ్ల క్రితం కొన్నది 1.38 ఎకరాలు
- అధికారిక రికార్డుల ప్రకారం తక్కువగా చూపుతున్న భూమి
- నేటికీ హద్దులు ఏర్పాటు చేయని పంచాయతీ అధికారులు



కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పశువుల సంత నిర్వహించే స్థలం

కొండమల్లేపల్లి: జిల్లాలోనే అతిపెద్దదిగా పేర్కొంచిన కొండమల్లేపల్లి పశువులు, మేకలు, గొర్రెల సంతకు చెందిన స్థలం ఆక్రమణకు గురవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ సంత ఆదాయం రూ.వేలల్లో ఉండగా అదికాస్త ప్రస్తుతం రూ.లక్షలకు చేరింది. దీనికి ప్రధాన కారణం కొవడ మల్లేపల్లి పట్టణం నాలుగు రోడ్ల (నల్లగొండ, మిర్యాలగూడ, హైదరాబాద్, దేవరకొండ) కూడలి కావడంతో పాటు రవాణా సౌలభ్యం అనుకూలంగా ఉండడమే అని చెప్పొచ్చు. అయితే సంత నిర్వహణకు గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా స్థలం ఉండాలని 2007 సంవత్సరంలో అప్పటి పంచాయతీ పాలక వర్గం ఆమోదంతో సుమారు రూ.12 లక్షలు వెచ్చించి 128 సర్వే.నంబర్‌లో 1.38 ఎకరాల స్థలాన్ని గ్రామ పంచాయతీ పేర కొనుగోలు చేశారు. కానీ, ఇప్పటి వరకు ఆ స్థలానికి సంబంధించి సంబంధిత అధికారులు కాని అప్పటి పంచాయతీ పాలకవర్గం కాని ఎలాంటి హద్దులు ఏర్పాటు చేయకపోవంతోనే అది కబ్జాకు గురవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆ.. భూమి ఏమైనట్టు?

ప్రస్తుతం కొండమల్లేపల్లి నుంచి జానిగాని తండాకు వెళ్లే రోడ్డుమార్గం సంత స్థలం గుండానే పోతుందని అప్పటి పాలకవర్గంలోని ఓ వ్యక్తి అంటున్నారు. మరో ముఖ్య విషయం ఏంటంటే కొందరు వ్యక్తులు కొంత భూమిని ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయించుకున్నారనే వదంతులు వినిపిస్తున్నాయి. మొత్తానికి ప్రస్తుతం గ్రామపంచాయతీకి సంబంధించిన భూమి ఎంత ఉంది అనే విషయాన్ని అధికారులను వివరణ కోరగా 1.20 ఎకరాల గుంటలు ఉన్నట్లు చెబుతున్నారు. మరి మిగతా 18 గుంటలు ఏమైందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంతకు ప్రస్తుత వేలం ద్వారా సంవత్సరానికి 1.23 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్న ఈ సంతకు మొదటి నుంచి కూడా సొంత స్థలం లేదు కానీ, 2007లో కొనుగోలు చేసిన స్థలాన్ని కూడా గ్రామ పంచాయతీ అధికారులు, పాలక వర్గం నిర్లక్ష్యం కారణంగా అది కబ్జాకు గురవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీకి ఉన్న స్థిరాస్తి కబ్జాకు గురికాకుండా కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంత స్థలాన్ని కాపాడుతాం..

కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పశువుల సంతకు చెందిన భూమి సుమారు 1.38 ఎకరాలుగా ఉంది. దీన్ని సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసుకోవడానికి స్థానిక తహసీల్దార్‌కు అర్జీ పెట్టాం. దీంతో ప్రస్తుతం ఎంత భూమి ఉంది.. ఎంత కబ్జాకు గురైందన్న విషయం తెలుస్తుందని విన్నవించాం. గ్రామ పంచాయితీ స్థిరాస్తిని కాపాడేలా చర్యలు తీసుకుంటాం.

– బాలరాజురెడ్డి ఎంపీడీఓ, కొండమల్లేపల్లి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



చింతపల్లిలో ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

దేవరకొండ: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదులో మాట్లాడారు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముదిగొండ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను పరామర్శించారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మేకల జానారెడ్డి, ప్రధాన కార్యదర్శి దారం దామోదర్, కొర్ర లోక్యానాయక్, క్రాంతి, నారాయణరెడ్డి తదితరులున్నారు.

చింతపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ పనిచేస్తుందని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆ సంఘం చింతపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం శ్రీసాయి బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు పాల్వాయి వాసుదేవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బసవరాజ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

గుర్రంపోడు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా గుర్రంపోడులో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గౌస్‌మొయినుద్దీన్, వి.మధుసూదన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు కిరణ్‌కుమార్, పాశం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లిలోని పాఠశాలల్లో సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండూరి లక్ష్మణ్ ఎంఈఓ ఆర్.నాగేశ్వర్‌రావు, కె.ఉదయ, మేకల జనారెడ్డి, కాలం నారాయణరెడ్డి, ఎ.అంజయ్య, వి.శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో పోటీతత్వం పెరగాలి



మాట్లాడుతున్న మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరిలో పోటీతత్వం పెరిగితేనే అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోగలుగుతామని మిర్యాలగూడలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కొండూరు నర్సయ్య మెమోరియల్(కేఎస్‌ఎం) డిగ్రీ కళాశాలకు ఇటీవల పీఎం ఉష పథకం కింద నిధులు మంజూరు అయ్యాయని, వాటితో కళాశాల నూతన భవనంతోపాటు కంప్యూటర్ ల్యాబ్ సమకూరుస్తామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పట్టుదలతో చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయాధికారి శివకృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ నరేష్, ఐక్యూఏసీ సమన్వయకర్త నాగరాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించాలి

నిడమనూరు : యువత సంక్షేమానికి రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మలం మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిడమనూరులో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది యువత రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు మల్లికంటి చంద్రశేఖర్, ధర్మారపు మధు, శ్రీకాంగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలి



పెద్ది శ్రీనివాస్‌గౌడ్‌ను బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న అధ్యక్షుడు రవీంద్రకుమార్

మిర్యాలగూడ : బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన పెద్ది శ్రీనివాస్‌గౌడ్ సోమవారం రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి ఏ పార్టీలో చేరకుండా మళ్లీ సేవ చేయాలన్న లక్ష్యంతో పార్టీలో చేరిన శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై పట్టింపేదీ!

దేవరకొండ: ప్రభుత్వ విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపే లేకుండా పోయిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినునిలు అస్వస్థతకు గురికావడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని పేర్కొన్నారు. అస్వస్థతకు గురైన వసతి గృహ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ



త్రిపురారంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

త్రిపురారం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని నిరూపితమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గోపగాని శ్రీనివాస్(బాచీ) అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడాన్ని హర్షిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్రిపురారంలో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సాగర్ రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, బహునూతుల నరేందర్, అంబటి సోమయ్య, కసిరెడ్డి నరేష్, కలగాని శ్రవణ్ కుమార్, గట్టు యాదగిరి, అనుముల వెంకట్‌రెడ్డి, ధనావత్ రవి నాయక్, పద్మ, బచ్చు సాంబయ్య, సలికంటి బాలకృష్ణ, బీపీ శ్రీనివాస్, పీబీ రవి, వేణు, వెంకట్రాం నాయక్, నాగరాజు, చిన్న మట్టయ్య, గంగుల శ్రీనివాస్, రంగారెడ్డి, చిన్న జానకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



హాలియా : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా : స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం హాలియా పట్టణంలోని అనుముల మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి కలిసి మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని, అయినా భయపడేది లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన గులాబీ జెండాలు ఎగురవేయాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, భిక్షానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తిరుమలగిరి నాగార్జునసాగర్ మండలంలోని రంగుండ్ల తండాకు చెందిన హోంగార్డు ఆంగోతు కిషన్ నాయక్ గుండెపోటుతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సోమవారం పరామర్శించారు. కిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అల్వాల గ్రామానికి చెందిన బైరు శ్రీను కుమార్తె మానస మరణించగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, ఆంగోతు కొట్యా, మునగాల జానకి రాములు, మల్లిఖార్జున్, శంకర్, రఘురాంరెడ్డి, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



మిర్యాలగూడలో మాట్లాడుతున్న సైదానాయక్

మిర్యాలగూడ : తెలంగాణ ప్రభుత్వం గిరిజన గురుకుల కళాశాలలను విలీనం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్, మండల కార్యదర్శి వీరన్ననాయక్ డిమాండ్ చేశారు. సోమవారం వారు దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థుల విలీనం ఆలోచన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో శివ, కార్తీక్, మహేష్, అశోక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకుడు ఇద్ది రాములు కోరారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో ఎంఈఓ వెంకటయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాకేష్, రమేష్, ఆంజనేయులు, మనోహర్, మహేష్, అరుణ్, శివ, యశ్వంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : బీసీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో పాటు మీడియా కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో శ్రీకాంత్, రాజు, కృష్ణ, గోవింద్, నాగరాజు, శరత్, సైదులు, వెంకట్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు సరికాదు



నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

మిర్యాలగూడ అర్బన్, నాగార్జునసాగర్, హాలియా, మాడుగులపల్లి: సూర్యాపేట జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని ఆ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం మిర్యాలగూడ, నాగార్జున సాగర్, హాలియా, మాడుగులపల్లి మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించిన సందర్భంగా నాయులు మాట్లాడారు. మిర్యాలగూడలో అరెస్టు అయిన వారిలో మాజీ కౌన్సిలర్లు సాధినేని శ్రీనివాస్, ఎండి.ఇలియాస్, తిరుమలగిరి వజ్రం, లక్ష్మీనారాయణ ఉన్నారు. అలాగే నాగార్జునసాగర్‌లో నందికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రమేశ్‌జీ, చంద్రమౌళి, లక్ష్మణ్‌నాయక్, రాము, రామస్వామి, పిట్ట సైదులు ఉన్నారు. హాలియాలో బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు పగడోజు సైదాచారి, బొడ్డుపల్లి మురళి, దూపాటి మధుసూదన్ రాజ్, ఖాదర్, జానీ, మాడుగులపల్లిలో అరెస్ట్ అయిన వారిలో కందిమళ్ల నరేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పుల్లెంల ఏడుకొండలు, చల్లా సైదిరెడ్డి, నేలపట్ల లక్ష్మయ్య, మేడం అంజయ్య, పుల్లెంల నర్సయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.

పేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్



మిర్యాలగూడ : బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



నిడమనూరు : సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని భాగ్యగోప సముద్రం తండాకు చెందిన అజ్మీరా సోనానాయక్‌కు మంజూరైన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జిందా, నాగునాయక్, అజ్మీరా, బాలునాయక్, భాస్కర్ నాయక్, వినోద్, మంగ్తానాయక్ పాల్గొన్నారు.

నిడమనూరు : పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల వైద్యసేవలకు భరోసాగా నిలుస్తోందని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆదేశాలతో నిడమననూరు మార్కెట్‌లో సోమవారం 15 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింగ్ విజయ్‌కుమార్, పని కృష్ణయ్య, జానీబాషా, యాదగిరి, అల్లంపల్లి మైస్వయ్య, సైదులు, చర్క శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్ మేళా

హాలియా : టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం హాలియా ఆర్టీసీ బస్టాండ్ నిర్వహించనున్న వికలాంగుల బస్‌పాస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటలకు హాలియా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించే బస్ పాస్ మేళాలో రూ.4వేలు పింఛన్ పొందేవారు తమ సదరం సర్టిఫికెట్లు చిన్నది, పెద్దది రెండు, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక ఫొటో, రూ.50లు తీసుకొని హాజరుకావాలని కోరారు.

వర్షాలు కురవాలని పూజలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఇరవై రోజులుగా వర్షాలు లేకపోవడంతో సాగుచేసిన మెట్టపంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాలు కురవాలని కోరుకుంటూ సోమవారం తిరుమలగిరి(సాగర్) మండలం యల్లాపురంలో రైతులు స్థానిక గంగమ్మతల్లికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందున్న బండపై వరద పాశం పోసి ఆరగించారు. వరుణదేవుడు కరుణించాలని వేడుకున్నారు.



యల్లాపురంలో వరద పాశం తింటున్న రైతులు

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

మిర్యాలగూడ అర్బన్: రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల యట్టయ్య కోరారు. ఎరువుల కొరతను నిరసిస్తూ సోమవారం మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సైదమ్మ, మోహన్‌నాయక్, వీరయ్య, గురువయ్య, లాలు నాయక్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981–83 విద్యా సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌లోని బర్కత్‌పూరలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్న పాండు, చిట్యాల శ్రీనివాస్‌రావు, రమణాచారి, మల్లయ్య, వెంకటరమణ, కాసుల సత్యం, శ్రీను, సుధీర్, రఘు, అలీ పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

చందంపేట : రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతున్న వారు వెంటనే క్షయవ్యాధి (టీబీ) పరీక్షలు చేయించుకుని, టీబీ నిర్ధారణ అయితే చికిత్స పొందాలని మండల వైద్యాధికారి కె.చందులాల్ అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా సోమవారం చందంపేట మండలం పోలేపల్లి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు టీబీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జున్, పులికంటి, శారద తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై సోమవారం దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు



31 వరకు 'ఓపెన్' అడ్మిషన్లు

త్రిపురారం : తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు పొందేందుకు ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించిందని మండలంలోని చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఉమ్మడి సైదిరెడ్డి, సహాయ కోఆర్డినేటర్ మాలోతు దశరథ నాయక్ తెలిపారు. పదవ తరగతి అడ్మిషన్‌కు రికార్డు షీట్, ఆధార్ కార్డు, పాస్ ఫొటో, కుల ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌లో అడ్మిషన్‌కు టెన్త్ మెమో, టీసీ, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో రావాలని పేర్కొన్నారు.